# రామరాజ్య రహస్యాలు

రచన: శ్రీ మహేశ్వర్.

(రాజూ - మంత్రీ)

"మంత్రీ!"

"చిత్తం ప్రభూ!"

"మన గురించి జనం ఏమనుకుంటున్నారు?"

"పీడ ఎప్పుడు విరగడౌతుంది" అని అహోరాత్రాలు, అష్టాదశపురాణాల్లోనూ వున్న అన్ని దైవాల్నీ కొలుస్తున్నారు!"

"ఐతే ఇంకా పాపం పండ లేదన్నమాట?"

"పండకేం? ప్రజల పాపం పండి పాతికేళ్లయింది.

"తెల్లటి, రాళ్లు లేని బియ్యం గాని, ధాన్యమూ రాళ్లూ కలసి లేని బియ్యం గాని; కళ్ళ జూసి ఎన్ని యుగాలైంది? రక్తపు కూడు తిన్నట్టుగా ఆ యర్రటి బియ్యంతో; అవీ కడుపు నిండా తినేందుకు లేక; దొరికే చారెడుగింజలకి కాళ్లు పడి పోయేలా డిపోల ముందు తపస్సు."

"మనం ఏం చేస్తాం మంత్రీ? జనాభా ఎక్కువ! పంటలు తక్కువ!"

'అది సరే ప్రభూ! బొంబాయి రవ్వ లేదు! మైదా లేదు; గోధుమలు లేవు; కాఫీ గింజలు లేవు; పంచదార లేదు; శనగపప్పు లేదు! కాని బ్లాక్ మార్కెట్‌లో అన్నీ వున్నాయి! టన్నులకి టన్నులు దొరుకుతాయి!'

'ప్రజలు సహకరించాలోయ్! బ్లాకులో కొనకూడదు.'

'అన్నం తినడం మానెయ్యాలి! తినేది లిమిటెడ్ కూడు, అదీ రెండు పూటలా కరువు!'

'ఆహారం అలవాట్లు మార్చుకోవాలి! పశువులు: పచ్చగడ్డి తిని పాలు యిస్తున్నాయి! పాలు మిశ్రమ ఆహారం. విటమిన్లువుంటాయి గడ్డినుండి పాలు వస్తాయి గనుక, ప్రతి వారూ తమ పెరళ్ళలో కావల్సినంత పచ్చిగడ్డి పండించుకొని తినొచ్చుగా.'

'ఒట్టి గడ్డి ఎలా తింటారు? కాస్త పచ్చడి చేసుకోనయినా తినాలంటే చింతపండు వీశె ఏడు రూపాయలు; మిరపకాయలు ఎనిమిది రూపాయలు; నూనె తొమ్మిది రూపాయలు... ఇలా ధరలు సస్తూంటే...'

'ధరలు తగ్గిస్తున్నామని పేపర్లలో చూడ్డంలే? ధరలు తగ్గించే చర్యలు తీసుకుంటామని పదేళ్ళుగా చెప్తున్నాం! ఇంకా ఎన్నేళ్ళు చెప్పమన్నా చెప్తాం!'

'నిజం నిజం! ధరలు అలా మండటమే మనకిమంచిది. కొత్తిమీర మొదలు మోటార్ కారు వరకూ ధరలు రోజురోజుకూ పెరగడం వల్ల అమ్మకం పన్ను ఆదాయం అధికంగా వస్తుంది. ఆహారధరలు అధికంగా వుంటే; కొనే శక్తిలేని ప్రజల దేహశక్తి క్షీణిస్తుంది. పిల్లల్ని కనే ఓపిక నశిస్తుంది! జనాభా పెరుగుదల అరికట్టేందుకు ఇదొక రహస్యం!'

+ + +

'మంత్రీ!'

'చిత్తం ప్రభూ!'

'భర్తృహరి ఏమన్నాడు? తివిరి ఇసుమున తైలంబు తీయవచ్చు' అన్నాడు. అంటే ఇసక నుండి నూని పిసకవచ్చు — గనుక; బంగాళాఖాతంలోనున్న ఇసుకనుండి నూరుకోట్లటన్నుల




నూనె తీసేందుకు నిపుణుల సంఘాన్ని నియమించు! ఏదో ప్రణాళికా కాలంలో ఏడు వందల కోట్లు దీనికి కేటాయిస్తే నూనె సమస్య తీరిపోతుంది. జిహ్వ చచ్చిన జనం అంతా అప్పుడు అప్పడాలు, వడియాలు, చిప్సు వేయించుకుని తినవచ్చు!

'ప్రభూ! ఇంతవరకూ అయిన ప్రణాళికల్లో శతకోటి, కోటానుకోట్ల రూపాయలు స్వాహా ఐనాయి! ఇనప పరిశ్రమల్లో నష్టం! వుక్కుల్లో నష్టం-రైల్వేల్లో నష్టం! బస్సు రవాణాల్లో నష్టం పబ్లిక్ మనీ ఇలా గోదావరి వాటర్‌లా పోతూంటే ఎన్ని పన్నులు పెంచినా ఏం లాభం!''

"నష్టం ప్రక్కన లాభం కూడా వుంటుంది! ఒక ప్రాజెక్టు నిర్మాణం సాగుతుందనుకో! కట్టేది కడుతూండగా కూలేది కూలుతూంటుంది! అందులో కొన్ని వందలో వేలో జనం చస్తారు! జనాభా తరుగుదల! అదొక లాభం! కూలిన భాగాలు మళ్ళా కట్టేందుకు పనివాళ్ళకు మళ్లా పని-నిరుద్యోగ సమస్య వుండదు—అదొక లాభం!''

"ఒకరి చావు ఇంకొకరికి పెళ్లితో సమానం అంటే ఇదే! కొన్ని కోట్ల జనాన్ని పన్నులతో దోచేస్తే; మరి కొన్ని కోట్లమంది ఆస్తులకి ఆస్తులు పెంచుకుంటారు! ఈ ఆస్తుల వాళ్లే ఇన్‌కంటాక్సు నామం పెడుతున్నారే! లేకుంటే మూడు వందలకోట్లు బకాయి ఎలా వుంది.''

"బకాయి వున్నా బాధ లేదు-దేశం జీవనాడికి లక్షాధికార్లూ కోటీశ్వరులే ఆధారం! ఎలక్షన్లలో ఓట్లు కొనేందుకు వాళ్లెన్ని లక్షలో ధార పోస్తారు!''

\+ + +

"మంత్రీ!''

"ప్రభూ!''

(తరువాయి 66వ పేజీలో)




మా ఖాతాదారులకు-శ్రేయోభిలాషులకూ దీపావళి అభినందనలు !!

మేము అతినూతనమైన యంత్రసాధనములను అమర్చి అతి సరసమగు, అత్యాకర్షణీయముగా, నేత్రానందకరమైన, జంకాళాలు మరియు బెడ్ షీట్లను తయారు చేస్తున్నాము. మహాశయులు మాకు చేయూతనిచ్చి అత్యధికముగా ఆర్డరు ఇవ్వవలెనని కోరుచున్నాము. మీ ఆర్డరును వెంటనే గమనించి సప్లై చేయుదుము.

(ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులోనే)

SIVAKUMAR INDUSTRIALS,
**BHAVANI (S. I.)**

P. B. No 38 Tel: "JAMAKKALAM"

(61వ పేజీ తరువాయి)

"ప్రజలకి విశ్వాసం లేదు! గత ఇరవై ఏళ్ళలో మనం ఎన్ని మంచి పనులు చేసేం?"

"ఏం చేసి చచ్చేరు? పన్నులు పెంచడం తప్ప; వసూలుచేసిన పన్నులు తుగ్లక్ ప్లానులకి చట్టాలకి తగలెయ్యడం తప్ప ఏం చేసేరు?

"బంగారం కంట్రోలు వల్ల ఏం ఒరిగింది? డీవేల్యువేషన్ వల్ల విదేశమారకం ఏ పెరిగింది? మనదేశంలో తయారైన సరుకు ఒఠి మోసం అని, ఫ్రాడ్ అని తెలిసి తెలిసి ఎవడు కొంటాడు? మద్రాసు బర్మా మార్కెట్‌లో విదేశీ సరుకులకున్న గిరాకీ చూస్తే మనదేశవాళీ సరుకుల కెంత విలువ వున్నదీ తేలిపోతుంది! పది సంవత్సరాలు క్యూలో కూర్చోగా; పాతిక వేల రూపాయలు తగలేసి కొన్న కార్లన్నీ ఒఠి డబ్బాలని ఈ మధ్య తమ ప్రభుత్వమే ఒప్పుకొంది!"

"కార్లు చేసే వారు కూడా ప్రజలే! ఆ ప్రజలూ ప్రభుత్వమే! ప్రజా ప్రభుత్వంలో సుఖం అదే!"

"అంతా ఒఠిమోసం! ఫ్రాడ్! ప్రజలే రాజ్యం ఏలుకుంటున్నారా? ఒక టిక్కెట్టు మీద గెలవడం; మాట నిలకడలేక మరో పార్టీలో చేరడం; స్వలాభాలకోసం; పర్మిట్లు అమ్ముకోడం రంగులు ప్లేట్లు ఫిరాయించడం; సమ్మెలు చేయించడం...అమాయక అనాధ జనం సతమతమై చావడం!"

"అసలింతకీ ఎవడన్నాడోయ్ స్వతంత్ర్యం వచ్చిందని! పాతికేళ్ళ వెనక ఎలా వుందో ఈ నాడూ అలానే వుంది! దేశంలో అనేక చోట్ల సెక్షన్ 114 అమలు; పోలీసుల తుపాకి కాల్పులు; చావులు-అరెస్టులు-జైళ్ళలో జాగా లేదు-ఫూర్లు, స్టేషన్లు, పోలీసు స్టేషన్లు, యూనివర్సిటీలు తగలెయ్యడం! మిలటరీవారు రావడం-ఏదీ స్వాతంత్ర్యం? ఇదే కాబోలు ప్రజల్ని ప్రజలే పాలించుకోడం!"

"అవన్నీ మరచేందుకూ, మభ్య పెట్టేందుకూ గాంధీ యజ్ఞాలు, నెహ్రూ జయంతులూ, క్విట్ ఇండియా వుత్సవాలూ చేయిస్తున్నాం!"

"వేరొక వంక పిల్లల పాలడబ్బాలు దొరకనీయకుండా బ్లేకు మార్కెట్ ప్రోత్సహిస్తూ అభాగ్య శిశువులను పస్తు పెడుతూ..."

"శిశువుల సంఖ్య పెరిగి పోతూంటే ఏం చేయటం? ఆ రకంగా పిల్లల ఆహార వస్తులు కరువు సృష్టిస్తే పిల్లల్ని కనడం తగ్గించేస్తారు! ఫామిలీ ప్లేనింగ్‌కి అదొక రహస్యం!"

చివరి రహస్యం:

"బియ్యంలో రాళ్ళున్నాయని బాధపడకండి. గాజుపెంకులూ తుప్పు పట్టిన చిన్న మేకులూ లేనందుకు ఆనందించండి!"

"చింత పండు పెరిగిందని ఏడవకండి"

నిమ్మకాయలు వాడండి!"

"గచ్చకాయంత నిమ్మకాయ 10 పైసలు అమ్ముతున్నారు!"

"నిమ్మకాయ తినకండి-"

"పుల్లగోంగూర తినండి"

"అయ్యో పావలాకి నాలుకాడలే ఇస్తున్నారు-"

"ఐతే, వుప్పూ, పులుపూ లేని చప్పిడి తిండి తినండి! పొదుపు చేసి ఆ డబ్బు మాకియ్యండి."

"ప్రణాళికల్లో పారపొయ్యండి"

లక్షాధికార్లు, ఎక్కువ ఐతే దేశం అందంగా వుంటుంది! విదేశీయులు టూరిస్టులు అధికంగా వస్తారు-విదేశ మారకం వస్తుంది.

'అదే ప్రజలకి మారకం-అంటే చావు-ప్రజలంతా సస్తే పన్ను ఎవరిస్తారు ప్రభూ!"